క్లుప్తంగా

పాఠశాలకు చేరిన యూనిఫాం



తరిగొప్పుల : ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభమయ్యే రోజు యూనిఫాం అందించడం జరుగుతుందని ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన యూనిఫాంని ఐకేపీ ఆధ్వర్యంలో 152 యూనిఫాంను కుట్టించడం జరిగిందన్నారు. శుక్రవారం కేజీబీవీ ప్రత్యేక అధికారిని గోవిందు రజితకు ఆయన అందజేశారు. ఐకేపీ ఏపీఎం విజయ, ఎంపీఓ ఆగామిస్బా అలాం, సీసీ సిద్దులు పాల్గొన్నారు.

బొడ్రాయికి జలాభిషేకం



చిల్పూరు: మండలంలోని మల్కాపూర్‌లో బొడ్రాయి ఏర్పాటు చేసి 7 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం అర్చకులు చొల్లేటి రాజేశ్వరశర్మ వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సకాలంలో వర్షాలు కురువాలంటూ మహిళలు బిందెలతో నీళ్లు తీసుకొచ్చి జలాభిషేకం చేశారు.

వీధుల్లో కుక్కల హల్‌చల్



జనగామ: పట్టణంలోని బాలాజీనగర్ 3వ వార్డులో వీధి కుక్కలు కాలనీవాసులను భయపెడుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళితే.. క్షేమంగా వెళ్తామో లేదో అనే భయంతో వణికిపోతున్నారు. ద్విచక్రవాహన చోదకులతో పాటు పాదచారుల వెంట పడుతూ పరుగులు పెట్టిస్తున్నాయి. అర్ధరాత్రి వేళలో తెల్లవార్లు అరుస్తూ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మునిసిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కల సమస్యను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆర్థికసాయం



రఘునాథపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండలంలోని నిడిగొండకు చెందిన కానుకుంట్ల క్రాంతికుమార్‌ను అదే గ్రామానికి చెందిన స్నేహితుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బిర్రు చిన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో క్రాంతికుమార్ కాలు విరిగి గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం విదితమే. బిర్రు చిన్ని తన స్నేహితులతో కలిసి చికిత్స పొందుతున్న క్రాంతికుమార్‌ను పరామర్శించారు.

12న వేలం పాటలు

బచ్చన్నపేట : మండలంలోని కొడవటూర్‌లోని స్వయంభూ శ్రీ సిద్ధేశ్వరాలయంలో వివిధ హక్కులకు వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి చిందం వంశీ తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలో మాట్లాడుతూ ఈ నెల 12న ఉదయం 11 గంటలకు సీల్డ్ కవర్, వేలం పాటలను నిర్వహించడం జరుగుతుందన్నారు. టెంకాయలు, పూజా సామాగ్రి అమ్ముకొనుటకు రూ.2 లక్షల డిపాజిట్, లడ్డూ, పులిహోరకు రూ. 50 వేలు, తలనీలాలు పోగుచేసుకొనుటకు రూ.1.50 లక్షలు, కొబ్బరి ముక్కలకు రూ. 25 వేలు డిపాజిట్ చేసి డీడీలు తీసిన వారు మాత్రమే వేలంలో పాల్గొనడానికి అర్హులు అన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఓం నమః శివాయ, జూనియర్ అసిస్టెంట్ చల్లా రాజేందర్‌రెడ్డి, మధు, లక్ష్మీకాంత్‌రెడ్డి, గంగం భానుప్రకాష్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

పశువుల తరలింపుపై కేసు

లింగాలఘణపురం: మండలంలోని నవాబుపేట అంగడి నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన కుంసోతు రాజు బొలెరో వాహనంలో పరిమితికి మించి పశువులను తరలిస్తుండగా పటేల్‌గూడెం వద్ద పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. వాహనంలో ఐదు పశువులను చల్లూరిలోని సహయోగ్ గోశాలకు పంపించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గడువులోగా పూర్తయ్యేనా..?

- స్కూళ్ల పునఃప్రారంభానికి మిగిలింది నాలుగు రోజులే..
- జిల్లాలో 508 ప్రభుత్వ పాఠశాలలు
- 'అమ్మ ఆదర్శ పాఠశాలల' కార్యక్రమం కింద 291 ఎంపిక
- అంచనా బడ్జెట్ రూ.9,38,72,000
- విడుదలైన నిధులు రూ.2,34,58,000
- సివిల్ పనులు పూర్తయిన స్కూళ్లు 117

జనగామ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'మనఊరు–మనబడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే రెండేళ్లుగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు మొదటి దశలో ఉన్నాయి. చేపట్టిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు డబ్బులు రాకపోవడంతో మధ్యలోనే నిలిపివేశారు. ఇటీవల రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 'అమ్మ ఆదర్శ పాఠశాల' పేరుతో జిల్లాలో 291 స్కూళ్లను ఎంపిక చేసి అభివృద్ధి పనులు మొదలు పెట్టింది. ఎంపిక చేసిన స్కూళ్లలో పనులు చేపట్టడానికి ఎన్నికల కోడ్ అడ్డొచ్చింది. రెండు నెలల నుంచి అధికార యంత్రాంగం సమీక్షలు నిర్వహించి సుమారు 117 పాఠశాలల్లో కేవలం సివిల్ పనులు పూర్తి చేశారు. 'మన ఊరు–మనబడి' కింద మధ్యలో ఆగిపోయిన 74 స్కూళ్ల పనులను 'అమ్మ ఆదర్శ పాఠశాల' ద్వారా చేపడుతున్నారు. ఏ ఒక్క పాఠశాలలో కూడా నూరు శాతం పూర్తి కాలేదు. అయితే తరగతి గదులు, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికి పనులు పూర్తి చేయాలని సర్కారు నుంచి ఆదేశాలు వచ్చాయి.



పాఠశాలలో పనులు చేపడుతున్న వర్కర్

కలెక్టర్ ఖాతాలో నిధులు జమ..

'అమ్మ ఆదర్శ పాఠశాల' కార్యక్రమం కింద జిల్లాలో ఎంపిక చేసిన స్కూళ్లలో వసతులు కల్పించేందుకు సుమారు రూ.9,38,72,000 అవుతుందని అంచనా వేయగా.. కలెక్టర్ ఖాతాలో రూ.2.34,58000 నిధులు జమ చేశారు. వాటితో పాఠశాలల్లో చేపట్టే పనులకు సంబంధించి ఇంజనీర్ అధికారులు అంచనా వేసి ప్రతిపాదనలు పంపిస్తారు. చేపట్టిన పనులను ఎంపీడీఓలు పర్యవేక్షించి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి అప్పగిస్తే.. వాటిని గ్రామ వీఓ, పాఠశాల హెచ్‌ఎం జాయింట్ ఖాతాలో జమచేస్తారు. ఎంబీ రికార్డుల ద్వారా పనులు చేప్టిన కాంట్రాక్టర్ లేదా పాఠశాల కమిటీకి చెల్లిస్తారు. గతంలో టెండర్ విధానం ఉండగా ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. నేరుగా పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు.

ఇవీ చేపట్టే పనులు..

పాఠశాలలో ఎస్‌ఎంసీ తీర్మానంతో ప్రహరీల నిర్మాణం, మరమ్మతులు, మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్ల నిర్మాణం, డైనింగ్ హాల్, వాటర్ పైపులైన్ ఏర్పాటు, విద్యుత్ సదుపాయం, ఫ్యాన్లు, లైట్లు, నూతన భవనాలు వంటి పనులు చేపట్టనున్నారు. పనులబట్టి ఆయా పాఠశాలకు నిధులు మంజూరు కానున్నాయి.

పనుల్లో వేగం పెంచుతున్నాం.



'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీల ద్వారా పనుల్లో వేగం పెంచడానికి చర్యలు చేపట్టాం. మండలాలు, నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు చేపడుతున్నాం. ఇప్పటికే 117 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. స్కూళ్ల పునఃప్రారంభం నాటికి మరిన్ని పూర్తి చేస్తాం.

-కె.రాము, డీఈఓ



పాలకుర్తి టౌన్ : బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



చిల్పూరు : మల్కాపూర్‌లో..



లింగాలఘణపురంలో..

ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి

- జనగామ ఎంపీపీ మేకల కళింగ రాజు

జనగామ రూరల్: ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించాలని ఎంపీపీ మేకల కళింగ రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని శామీర్‌పేటలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా విద్యార్థుల తల్లి దండ్రులు, ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధీర్‌రెడ్డి, మమత, తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్: పాఠశాలల్లో చేర్పించాలని నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య అన్నారు. శుక్రవారం టెంపుల్ కాలనీ ప్రాథమిక పాఠశాల నుంచి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఎస్‌ఓ నర్సయ్య, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శోభా రాణి, హెచ్‌ఎం మాధవిలత, పారిజాతం, పాల్గొన్నారు.

10 మంది విద్యార్థుల గుర్తింపు

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్‌లో శుక్రవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లలను 10 మందిని గుర్తించడం జరిగిందని సీనియర్ ఉపాధ్యాయురాలు శ్రీదేవి తెలిపారు. భట్టువాండ్లతండ, పల్లగుట్ట గ్రామాల్లో హెచ్‌ఎంలు దారం శ్రీనివాస్, నర్సింహారెడ్డిలు బడిబాట కార్యక్రమాలు నిర్వహించారు.

లింగాలఘణపురం: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి కోరారు. శుక్రవారం మండలంలోని వనపర్తి శివారు మర్రితండాలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జలేందర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



జనగామ రూరల్ : బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ కళింగరాజు

ప్రైవేట్‌కు దీటుగా ప్రచారం

దేవరుప్పుల : ప్రభుత్వ పాఠశాలలో అత్యధిక విద్యార్థుల ప్రవేశాల కోసం తలపెట్టిన ప్రభుత్వ ఆదేశాలకు భిన్నంగా కడవెండి హైస్కూల్ ఉపాధ్యాయ బృందం వినూత్న ప్రచారం చేపట్టారు. శుక్రవారం ఆ గ్రామంలో హైస్కూల్ హెచ్‌ఎం పి.వెంకన్న ఆధ్వర్యంలో విద్యాబోధన ప్రమాణాలపై వాల్‌పోస్టర్లను పురవీధుల్లో అతికించారు.ఉపాధ్యాయులు కె ప్రభాకర్, జి ఇందిర, బి మల్యా, సురేందర్, సిహెచ్ శ్రీనివాస్, ఎం గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్ : మండలంలోని తిమ్మంపేటలో నిర్వహించిన బడిబాటలో ప్రధానోపాధ్యాయులు మంగు జయప్రకాశ్, ఉపాధ్యాయులు కొండ రవి, కవిత, శ్రీనివాస్‌రావు, సునితతో పాటు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 10 మంది విద్యార్థులను బడిలో చేర్పించారు.

రఘునాథపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య ఉంటుందని ఇబ్రహీంపూర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు ఎం.సత్యనారాయణ, యేరువ సుందరి అన్నారు. శుక్రవారం గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు గాయత్రి, రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు రాజమణి, హేమలత తదతరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి–కొండాపూర్ గ్రామ పంచాయతీల సరిహద్దులోని సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణంలో శుక్రవారం 2008–09 సంవత్సరానికి చెందిన టెన్త్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు.



ఎంపీ కడియం కావ్యకు అభినందనలు

స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు/రఘునాథపల్లి : వరంగల్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలుపొందిన డాక్టర్ కడియం కావ్యను, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిని స్టేషన్‌ఘన్‌పూర్ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, చిల్పూరు మండలం రాజవరం ఎంపీటీసీ మారేపల్లి లలితశ్యాంకుమార్, రఘునాథపల్లి సీపీఐ నేతలు ఆది సాయన్న శుక్రవారం హన్మకొండలో వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కడియం కావ్యకు, శ్రీహరికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కట్టమల్లు, రాములు, యాదగిరి, సంపత్, మల్లేశం, శ్రీను, రఘు, పాలకుర్తి నాగరాజు, తీగల మహేందర్, జక్కుల రాజయ్య, నల్ల ఎల్లయ్య, మాజీ సర్పంచ్‌లు రవీందర్, స్వప్నవెంకటేష్, సత్తయ్య, రాజు, రవి సుగుణమ్మ, యాదగిరి, రాజ్‌కుమార్, తదితరులు అభినందనలు తెలిపారు.



స్టేషన్‌ఘన్‌పూర్ : కడియం శ్రీహరి, కావ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సుధీర్‌రెడ్డి



చిల్పూరు : పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీటీసీ లలిత



రఘునాథపల్లి : శుభాకాంక్షలు తెలుపుతున్న సీపీఐ నాయకులు

ప్లాస్టిక్ బ్యాగులు వినియోగించొద్దు

లింగాలఘణపురం: ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలోని కిరాణంషాపు నిర్వాహకులకు ప్లాస్టిక్ బ్యాగులు వినియోగించవద్దని నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, వీఏఓలు పాల్గొన్నారు.

నేడు జనగామ డివిజన్‌లో కరెంటు కోతలు

జనగామ/నర్మెట/బచ్చన్నపేట: జనగామ నియోజకవర్గంలోని నర్మెట, బచ్చన్నపేట సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంటు కోతలు ఉంటాయని ఎన్పీడీసీఎల్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 132 కేవీ నర్మెట, బచ్చన్నపేట సబ్‌స్టేషన్ల పరిధిలో ట్రాన్స్‌కో డిపార్టు మెంట్ అత్యవసర మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. రెండు సబ్‌స్టేషన్ ఏరియాలోని నర్మెట, వెల్దండ, హనుమంతపూర్, మేకలగట్టు, తరిగొప్పుల, అబ్దుల్ నాగారం, అంకుశాపూర్, బొంతగట్టు నాగారం, అలీంపూర్, లక్ష్మాపూర్, బచ్చన్న పేట, రామచంద్రాపురం, పడమటికేశ్వాపూర్, సబ్‌స్టేషన్ల పరిధిలో కరెంటు కోతలు ఉంటాయన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేవరుప్పుల : మండలంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ ఇంజనీర్ సుధాకర్ తెలిపారు. దేవరుప్పుల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి కామారెడ్డిగూడెం, గొల్లపల్లి, మున్‌పహాడ్, పడమటితండా విద్యుత్ సబ్‌స్టేషన్ తోపాటు మాధాపురం, దేవునిగుట్ట, దుబ్బతండా, సీర్మాల విద్యుత్ సబ్‌స్టేషన్‌తోపాటు రామరాజుపల్లి, చిన్నమడూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌తోపాటు అప్పిరెడ్డిపల్లె నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉన్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

మిషన్ భగీరథ నీటి సరఫరా

సాక్షి ఎఫెక్ట్

స్టేషన్‌ఘన్‌పూర్: గత ఐదురోజులుగా మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడగా ఎట్టకేలకు శుక్రవారం అధికారులు స్పందించి నీటిని అందించారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు గోస పడుతున్నారని 'ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా' శీర్షికతో సాక్షిలో వచ్చిన కథనానికి ఎట్టకేలకు అధికారులు స్పందించారు. శుక్రవారం మిషన్‌భగీరథ నల్లాల ద్వారా నీరు రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఈ ప్రజ్వల్ మాట్లాడుతూ మిషన్‌భగీరథ నీరు సరఫరా అయ్యే కొండపాక వద్ద గేట్‌వాల్వ్ రిపేర్ కావడంతో సమస్య ఏర్పడిందన్నారు. సమస్యను అధికారులు గుర్తించి సత్వర చర్యలు చేపట్టారని, దీంతో మిషన్‌భగీరథ నీరు యధావిధిగా సరఫరా అవుతున్నాయని తెలిపారు.



శివునిపల్లిలో మిషన్ భగీరథ నీరు పట్టుకుంటున్న మహిళ

10న తహసీల్ ఎదుట ధర్నా

చిల్పూరు: మండలంలో భూసమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న తహసీల్ కార్యాలయం ఎదుట సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి సొదం రమేశ్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో భూ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం సీఐటీయూ మండల అధ్యక్షుడు అపరాదపు రాజు అధ్యక్షతన నిర్వహించగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు వారి సమస్యలతో కూడిన భూమిపత్రాలతో హాజరయ్యారు. పెద్ద జిల్లాలు, మండలాల వల్ల రైతులు, ప్ర జలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, గత ప్రభుత్వం పెద్ద మండలాలు, జిల్లాలను విడదీసి చిన్న మండలాలు చేస్తే అధికారుల నుంచి సమస్యలు ఎక్కువ అయ్యాయని అన్నారు. ఇక్కడి తహసీల్దార్ వద్దకు రైతులు వెళ్లి సమస్యలపై నిలదీస్తే అక్రమంగా కేసులు పెట్టిస్తూ అందరిని భయభ్రాంతులకు గురిచేస్తుందని అన్నారు.కుమారస్వామి, ప్రభాకర్, భీమన్న, కనుకయ్య, రాజు, సమ్మయ్య, శివశంకర్, ఎల్లయ్య, యాదమ్మ పాల్గొన్నారు.

మొన్న గొల్లపల్లి...నేడు రంబోజీగూడెం

- స్థానిక అవసరాల పేరిట ఇసుక తరలింపు

దేవరుప్పుల : కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక అవసరాల కోసం ఆయా ఏరియాల్లోని వాగుల్లోని ఇసుక వాడుకోవచ్చనే ఉత్తర్వులను ఆసరా తీసుకొని మండలంలో మొన్న గొల్లపల్లి...నేడు రంబోజీగూడెం చెక్‌డ్యామ్‌ల వద్ద రిజర్వాయర్ల నిర్మాణ పనుల కోసమని ఇసుక తరలించేందుకు శ్రీకారం చుట్టారు. ఎంపీ ఎన్నికల కంటే ముందు చెక్‌డ్యామ్‌ల వద్ద ఇసుక పేరుకపోయిందని, తీస్తే నీటి నిల్వలు పెరుగుతాయనే సంబంధిత అధికారుల నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అసిస్టెంట్ జీవాలజీస్ట్ అండ్, అసిస్టెంట్ డైరెక్టర్స్ జనగామచే ప్రభుత్వ అనుమతులు వచ్చాయి. ఈ రెండు ప్రాంతాల్లో సుమారు మీటరు లోతు మేరకు 5 వేల క్యూబిక్ మీటర్ల చొప్పున ఇసుక తరలించేందుకు కార్యాచరణకు సన్నద్ధం అయ్యారు. ఒడ్డుకు చేర్చిన ఇసుకను అధికారుల పర్యవేక్షణలో టిప్పర్ల ద్వారా తరలించేందుకు నిబంధనలు సూచించారు. ఇదే తరుణంలో ఇటీవల గొల్లపల్లి చెక్‌డ్యామ్ వద్ద నుంచి పాలకుర్తి రిజర్వాయర్‌కు ఇసుక తరలించేందుకు యంత్రాలు దిగగా రాజకీయాలకతీతంగా రైతులు రెండు పర్యాయాలు అడ్డుకొని వెళ్లగొట్టారు. ఇదే క్రమంలో రంబోజీగూడెంకు గతంలో మంజూరైన ఇసుక తరలింపు అనుమతుల కాలం చెల్లడంతో తిరిగి ఈ నెల 30 వరకూ చెన్నూరు రిజర్వాయర్‌కు ఇసుక తరలించేందుకు అనుమతులు వచ్చాయి. దీంతో శనివారం మధ్యాహ్నం నుంచే ఇటాచీ యంత్రాలతో ఇసుక తీసి ట్రాక్టర్ల ద్వారా ఒడ్డుకు చేరుస్తున్నారు. దీంతో ఇసుక రవాణా వల్ల గతంలోనే అక్రమంగా తరలించిన ఇసుకతో పలు ప్రాంతాల్లో మట్టితేలి పిచ్చిచెట్లు మొలిచాయన్నారు. ఇసుకమేట పేరిట ఇది తీస్తే దేవరుప్పుల, చిన్నమడూరు, రంబోజిగూడెం, రాజీవ్‌నగర్, గొల్లపల్లి, మున్‌పహాడ్ వాగుపరివాహక రైతులకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చెక్‌డ్యామ్ వద్ద ఇసుక తీస్తున్న ఇటాచీ

తరలిస్తే బోర్లు ఎండిపోతాయి

పై మండలాల్లో రిజర్వాయర్లు కట్టడంతో వాగులు పొంగడం కనుమరుగు అయ్యాయి. 20 ఏళ్ల కిందట ఇసుక స్థానిక అవసరాలు, ఇతరేతర మండలాల అభివృద్ధి పేరిట ఇసుక ఖాళీ అయింది. ఇప్పుడు రిజర్వాయర్‌ల నిర్మాణం కోసమని డ్యామ్‌ల మేట ఇసుకతీస్తే ఇక ఇసుక వచ్చుడు చూడం. ఇక్కడ నీళ్ల నిల్వ కట్టడి కంటే ఇంకే గుణం ఉన్న ఇసుక ఉంటే మాకు చాలు.


– సింగిరెడ్డి సరిత, మాజీ సర్పంచ్

గత ప్రభుత్వ ఇసుక అనుమతుల పునరుద్ధరణ


గత ప్రభుత్వం హయాంలోనే చెన్నూరు, పాలకుర్తి రిజర్వాయర్ల నిర్మాణ పనుల కోసం ఇక్కడి చెక్‌డ్యామ్‌ల నుంచి ఇసుక అనుమతులు పొందారు. వర్షాభావ పరిస్థితులతో ఇసుక తీయలేకపోయినందున తిరిగి కాంట్రాక్టర్ల వినతి మేరకు ప్రభుత్వ నిబంధనల మేరకు సీనరేజీ చార్జీలు తీసుకొని ఇసుక అనుమతులు పునరుద్ధించాం. చెక్‌డ్యామ్‌లో ఇసుక మేటలు తీస్తే నీటీ నిల్వలు పెరుగుతాయి. ఇసుక తరలించే విషయంలో రెవెన్యూ, పోలీసు, మైనింగ్, ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలో జీపీఎస్ విధానం అమలు పరుస్తాం.

– కె ప్రవీణ్, ఈఈ ఇరిగేషన్ జనగామ డివిజన్

భువనగిరి ఎంపీని కలిసిన కాంగ్రెస్ నేతలు



జనగామ: ఎంపీని సత్కరిస్తున్న డాక్టర్ రాజమౌళి



బచ్చన్నపేట : ఎంపీని కలిసిన కాంగ్రెస్ నేతలు

జనగామ/బచ్చన్నపేట: భువనగిరి ఎంపీగా భారీ మెజార్టీతో విజయం సాధించిన లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్ పద్దఅంబర్‌పేటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రముఖ డాక్టర్ రాజమౌళి, బచ్చన్నపేట మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. జనగామ నాయకులు మోర్తాల ప్రభాకర్, తదితరులతో కలిసి డాక్టర్ రాజమౌళి ఎంపీని సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు. అలాగే పడమటికేశ్వాపూ ర్ మాజీ సర్పంచ్ రమేష్, నల్లగోని వేణు, అఖిల్, సందీప్, కరుణాకర్, అభి తదితరులు అభినందించారు.

సంక్షిప్త సమాచారం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


బచ్చన్నపేట : గ్రామాల్లో ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. శుక్రవారం పారిశుద్ధ్య దినోత్సవం సందర్భంగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో తిరిగి పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పశువుల తరలింపును అడ్డుకున్న నేతలు



పాలకుర్తి టౌన్: కురవి మండలం నుంచి హైదరాబాద్‌కు పాలకుర్తి మండలం నుంచి డీసీఎం వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 11 పశువులను స్వాధీనం చేసుకోవడం జరిగిందని బీజేపీ మండల అధ్యక్షుడు దుంపలి సంపత్ తెలిపారు. శుక్రవారం ఎస్సై సాయి ప్రసన్నకుమార్‌కు సమాచారం అందించినట్లు ఆయన తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం. అనుమతి లేకుండా తరలిస్తున్న పశువులను పట్టుకున్న వాటిని ఆలయ అర్చకుడు దేవగిరి రమేష్‌శర్మ గోశాలకు తరలించి అప్పగించామని ఎస్సై తెలిపారు. నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



పాలకుర్తి: సీజనల్‌గా వస్తున్న వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలని పాలకుర్తి ప్రాథమిక ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ రవి రాథోడ్ అన్నారు. శుక్రవారం ఆయన ఆస్పత్రి ఆవరణలో వైద్య సిబ్బందితో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రిజర్వేషన్ సాధనే లక్ష్యంగా కృషి చేయాలి

చిల్పూరు: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ సాధనే లక్ష్యంగా నూతన కమిటీలు పనిచేయాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ పిలుపునిచ్చారు. మండలంలోని రాజవరంలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల మహిపాల్ అధ్యక్షతన నూతన కమిటీలను ప్రకటించారు. అనంతరం స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్‌గా రాజవరం గ్రామానికి చెందిన ఎడ్ల అనీల్‌కుమార్, మండల అధ్యక్షుడిగా ఎడ్ల అశోక్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు.